సంక్రాంతికైనా సారొస్తారా..?
● నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని మాజీ మంత్రి నాగేంద్ర
8
పొదుగులు కోసిన వారిని శిక్షించాలి
● ఆవులను హింసించిన వారిపై చర్యలు తీసుకోవాలి: బీజేపీ

భోగిభాగ్యాలు కలగని..!

● రాష్ట్ర వ్యాప్తంగా భోగి సంబరాలు ● రంగు రంగుల ముగ్గులతో లోగిళ్లు కళకళ ● నేడు సంక్రాంతి



విజయనగర్‌లోని భోగి వేడుకలు చేసుకుంటున్న మహిళలు, చిన్నారులు

రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. పండుగను ప్రాంతాల వారీగా వేర్వేరు సంప్రదాయాలతో జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతికి అంతా సిద్ధం అయ్యింది. చెరకు గడలు, నవధాన్యాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి.

7లో



చెరకులు, నవధాన్యాల కొనుగోలు



ప్రభుత్వం పటిష్టం..

విభేదాలు ఊహాజనితం..!

● విందులు.. సమావేశాలు నిర్వహిస్తే తప్పెలా అవుతుంది?
● సర్కారులో సమస్యలే లేవు ● కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలా



సీఎం, డీసీఎంతో రణదీప్‌సింగ్ సుర్జేవాలా

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం పటిష్టంగా ఉందని కానీ ప్రతిపక్షాలు ఊహాజనితమైన అంశాలను తెరపైకి తెస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా మండిపడ్డారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇటీవల విందు రాజకీయాల వివాదం, కేపీసీసీ అధ్యక్షుడి మార్పు ప్రస్తావన, బెళగావిలో గాంధీ భారత సభ నిర్వహించే విషయమై పార్టీ వర్గాలతో చర్చించేందుకు సుర్జేవాలా బెంగళూరుకు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం కేపీసీసీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, జేడీఎస్‌లలో భిన్నాభిప్రాయాలు తీవ్రమయ్యాయన్నారు. వారి మైత్రిలోనూ గుసగుసలు మొదలయ్యాయన్నారు. వీటిని కప్పిపుచ్చేందుకు కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలంటూ అధికారం కోసం ప్రయత్నాలంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారం కోసం ప్రయత్నాలనేది కేవలం మీడియా సృష్టి మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలతో ప్రజలకు చేరువయ్యిందన్నారు. రాష్ట్రంలో కాషాయపార్టీ భయంతో లేనిపోనివి తెరపైకి తెస్తున్నారన్నారు. మా ప్రభుత్వంపైగానీ సీఎం, డీసీఎంలపైగానీ దాడి చేయడం లేదని, కర్ణాటక ప్రజలకు వ్యతిరేకంగా బీజేపీ, జేడీఎస్‌లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీఎం సీటు ఖాళీ లేదన్నారు. కానీ ముఖ్యమంత్రి మార్పు అంటూ పదే పదే మీడియాలో ప్రచారం జరుగుతోందన్నారు. విందుకు భేటీ అయితే రాజకీయం అంటగట్టారన్నారు. ఊహాజనితమైన అంశాలపై మేం చర్చించమన్నారు. ఎస్సీ, ఎస్టీ మంత్రులతో సీఎం భేటీ అయితే దానిని భూతద్దంలో చూపుతున్నారన్నారు. ఎటువంటి నిర్ణయం తీసుకోవాలన్నా అధిష్ఠానం పటిష్టంగా ఉం దని తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. పవర్‌షేరింగ్ అనే అంశం ఎవరూ మాట్లాడకూడదని సుర్జేవాలా తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. మరోసారి ఇటువంటి ప్రస్తావనలు తీసుకురాకూడదని తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది.

'గాంధీ భారత' సభ విజయవంతం చేద్దాం: డీసీఎం

బెళగావిలో ఈనెల 21న జరిగే గాంధీ భారత సభ విజయవంతం చేద్దామని డీసీ ఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. కేపీసీసీలో జరిగిన పదాధికారుల సభలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ గత నెలలో తలపెట్టిన గాంధీ భారత సభ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో వాయిదా పడిందన్నారు. సదరు సభను చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేద్దామన్నారు. 224 నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలను సభకు తీసుకురావాలన్నారు. కనీసం నియోజకవర్గానికి వందమంది చొప్పున తీసుకొచ్చే బాధ్యత సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లదే అన్నారు. ఈనెల 15, 16న అన్ని నియోజకవర్గాల్లో ముందస్తు ఏర్పాట్లపై సభలు జరపాలని సూచించారు. ఇప్పటికే ఉత్తర కర్ణాటకలో 55మంది ఎమ్మెల్యేలకు కీలకమైన బాధ్యతలు అప్పగించామన్నారు. మూడు నాలుగు నెలల్లో పంచాయతీ, తాలూకా, జిల్లాస్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసే విషయమై చర్చిస్తామన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు సీఎం, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

సుర్జేవాలా దిశానిర్దేశం

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సుర్జేవాలా రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. ప్యాలెస్‌రోడ్డులోని ఓ హోటల్‌లో సీఎల్పీ సభ జరిగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలందరూ హాజరయ్యారు. ఇటీవల రాజకీయంగా సాగిన అంశాలపై సుర్జేవాలా తీవ్రస్థాయిలో మండిపడినట్టు సమాచారం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ ఇదేం తీరు అని మందలించినట్లు తెలుస్తోంది. మరోసారి ఎవరికివారు నిర్ణయాలు తీసుకోరాదని సూచించినట్లు తెలుస్తోంది. అన్నింటినీ పరిశీలిస్తుంటామని తమకు హెచ్చరించినట్లు తెలుస్తోంది. అభిప్రాయాలు తీసుకునే సమయం ఉంటుందని ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూడరాదని సూచించారు.

సీఎం నోట.... త్యాగం మాట

కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యలు ఆయన ఆప్తులు, అనుచరుల్లో ఒకింత ఆందోళనకు రేకెత్తిస్తున్నాయి. కేపీసీసీలో సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎంతోమంది నాయకులు త్యాగం చేశారని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు పార్టీ కోసం జీవితకాలం పనిచేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి పదవిని వారు కాదనుకున్నారన్నారు. మనం కూడా ఒక్కోసారి త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల సీఎం మార్పు అంశం చర్చలు సాగుతున్న తరుణంలోనే సిద్దరామయ్య ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చకు కారణమైంది. పార్టీలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. నాయకత్వ మార్పు ఉండదని కూడా వ్యాఖ్యానించారు. ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు మల్లికార్జున ఖర్గేలు చర్చిస్తారన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మంత్రులకు దడ ..!

● 31మంది పనితీరుపై ఏఐసీసీకి నివేదిక

బెంగళూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు పూర్తి కావడం, మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం కొనసాగుతున్న తరుణంలోనే మంత్రుల పనితీరుపై ఏఐసీసీకి నివేదిక సమర్పించడంతో దడ పట్టుకుంది. మరో నెలరోజుల్లో శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆ వెంటనే బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈలోగానే విస్తరణ ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే సీఎం సిద్దరామయ్య మరోసారి కేబినెట్‌లోకి తీసుకుంటానని శాసనసభ ఉప ఎన్నికల వేళ రాజీనామా చేసిన నాగేంద్రకు బహిరంగంగా హామీ ఇచ్చారు. మరికొంతమంది ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా సాగుతున్న తరుణంలోనే మంత్రుల పనితీరుపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రూపొందించిన నివేదికను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాకు సోమవారం అప్పగించారు. కేపీసీసీలో జరిగిన పార్టీ పదాధికారుల సభలో సీఎం, డీసీఎంలు సమర్పించారు. రాష్ట్ర కేబినెట్‌లో పదిమంది మంత్రులు క్రియాశీలకం మినహా మిగిలినవారు తమ శాఖలపై పట్టు సాధించలేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలు సైతం మంత్రుల పనితీరును తప్పుపట్టిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలోనే కీలకమైన నివేదిక ఏఐసీసీకి చేరడంతో మంత్రివర్గ విస్తరణ, లేదా పునఃవ్యవస్థీకరణ ఉంటుందా..? అనేది చర్చనీయాంశం అవుతోంది.

సీటీ రవి వివాదంలో నా నిర్ణయమే అంతిమం

● సీఐడీకి కేసు సరికాదు
● సభాపతి హొరట్టి



బెంగళూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణసౌధ విధానపరిషత్‌లో డిసెంబరు 19న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, బీజేపీ సభ్యుడు సీటీ రవిల మధ్య వాగ్వాదంపై పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి మరోసారి మండిపడ్డారు. ఈ వివాదంపై తన నిర్ణయమే అంతిమమన్నారు. బెంగళూరు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరికాదన్నారు. సభలో జరిగిన వివాదంపై సీఐడీకి కేటాయించడం తగిన చర్య కాదన్నారు. రాజ్యాంగ సంఘర్షణకు కారణం కానుందన్నారు. సీటీ రవి అనుచితమైన పదాలు వాడినట్లు సాక్ష్యం లేదని తీర్మానించినా ప్రభుత్వం సీఐడీకి కేటాయించడం సమంజసం కాదన్నారు. కర్ణాటక విధానపరిషత్ కార్యాచరణ, నిబంధనలు లోక్‌సభ, రాజ్యసభ నిబంధనలు, కౌల్ అండ్ సెక్టర్ ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంటును పరిశీలించిన తర్వాతనే సభాపతి హోదాలో తీర్పునిచ్చానన్నారు. సభాపతి రూలింగ్‌కు భంగం కలిగించేలా పాలనా విధానం వర్తించరాదన్నారు. రాజ్యాంగానికి మూలమైన శాసనాంగ, సభాపతికి ఉండే హక్కులు, అధికారాలను భంగం కలిగించేలా సీఐడీ విచారణకు ఆదేశించారన్నారు. పరిషత్ తన సభ్యులను శిక్షించే అధికారం ఉందని ఇప్పటివరకు ఇదే ప్రక్రియ సాగిందన్నారు. దశాబ్దాలుగా కొనసాగిన సంప్రదాయాలను సభాకలాపాల వేళ తలెత్తిన విబేధాలను నియంత్రించే అధికారం సభాపతి ఉంటుందన్నారు. అంతిమంగా సభాపతి తీర్మానమే కీలకమన్నారు. సీఐడీకి కేసును అప్పగించడం ద్వారా రాజ్యాంగ సంఘర్షణకు అవకాశం ఇచ్చారన్నారు. శాసనసభ, పాలనా రంగాల మధ్య అనవసరమైన సంఘర్షణకు అవకాశం ఇవ్వరాదన్నారు. పరిషత్‌లో జరిగిన సంఘటన సభాపతి పరిధిలోకి రావడం సహజమన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ పలు రాజ్యాంగబద్ధమైన పదవులలో కొనసాగిన అనుభవం ఉన్నారు. వాటి పరిధిలోనే నిర్ణయం తీసుకోవాల్సి ఉండేదన్నారు.

ఇదే విషయమై హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ పరిషత్ సభాపతి రాసిన లేఖ మాకు అందలేదన్నారు. సభాపతి చట్టపరంగానే తీర్పు ఇచ్చారని, మేం చట్ట పరిధిలోనే విచారణ జరిపిస్తామన్నారు. వివాదాలకు చెక్‌పెట్టాలనే సంఘటనకు సంబంధించి వాస్తవాలను గుర్తించేందుకు సీఐడీకి అప్పగించామన్నారు. దీంతో రాజ్యాంగ సంఘర్షణ కాదన్నారు. శాసనసభ పరంగా సార్వభౌమత్వానికి భంగం కలగకుండా పరిశీలించాలన్నారు. వాగ్వాదం జరిగిన వెంటనే మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, వారు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విడుదల చేశారన్నారు. ఎఫ్ఐఆర్‌పై విచారణ జరగాల్సి ఉందన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా బనశంకరీ దేవి రథోత్సవం

బెంగళూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలో బనశంకరీ దేవి రథోత్సవం వైభవంగా జరిగింది. పుష్యమాసం పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం అమ్మవారికి విశేషపూజలు, అలంకరణలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.45 నుంచి 1.30 గంటలలోపు శుభమేష లగ్నంలో రథంపై అమ్మవారిని కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు శాకాంబరిదేవి ధూళోత్సవం ఘనంగా జరిగింది.

ఇన్‌చార్జ్‌లే దిక్కు

- ఇరిగేషన్‌లో ఇన్‌చార్జ్‌ల పాలన
- కీలక పోస్టుల్లోనూ కింది స్థాయి అధికారులే
- మైనర్ ఇరిగేషన్, హంద్రీనీవా ఎస్‌ఈలు ఖాళీ
- హెచ్ఎన్ఎస్ఎస్‌లో నాలుగు ఈఈ పోస్టుల్లో డీఈలే
- కీలక సమయంలో అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు



మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కీలక పోస్టులకు అధికారులు లేకపోవడంతో జలవనరులశాఖను ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. జిల్లా జలవనరుల శాఖలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, తుంగభద్ర ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ), మైనర్ ఇరిగేషన్ విభాగాలు ఉన్నాయి. హెచ్చెల్సీ ఎస్‌ఈగా రాజశేఖర్ ఉన్నారు. ఈయన ఏడాది కాలంలో రిటైర్డ్ కానున్నారు. మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈగా ఉన్న శ్రీనివాసులురెడ్డి ఆరు నెలల కిందట ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి డ్వామాలో క్వాలిటీ కంట్రోల్ ఈఈగా పనిచేస్తున్న విశ్వనాథ్‌రెడ్డి ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగుతున్నారు. హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఉన్న దేసేనాయక్ మూడు నెలల కిందట నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ నాగరాజ అదనపు బాధ్యతలతో కొనసాగుతున్నారు. ఎస్‌ఈ పోస్టుల సంగతి అలా ఉంచితే ఆ తరువాత స్థాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) పోస్టులలో కూడా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు పూర్తయినా రెగ్యులర్ ఇంజనీర్లను నియమించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక జలవనరుల శాఖలో ప్రధానమైన క్వాలిటీకంట్రోల్ ఈఈ పోస్టులో జోన్‌లో డీఈగా పని చేస్తున్న రమేష్‌బాబు అదనపు బాధ్యతలతో కొనసాగుతున్నారు.

డీఈలకు ఈఈలుగా బాధ్యతలు

హంద్రీనీవా డివిజన్-5కి డీఈ శ్రీనివాస్‌నాయక్ ఇన్‌చార్జి ఈఈగా ఉన్నారు. డివిజన్ -6కి అదే డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఈఈగా(ఎఫ్ఏసీ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డీఈ వెంకటేశ్వర్లుశెట్టి ధర్మవరం ఇన్‌చార్జి ఈఈగా కొనసాగుతు న్నారు. ఇక పెనుకొండ డివిజన్ ఈఈగా డీఈ మురళీకృష్ణ(ఎఫ్ఏసీ) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎస్‌ఈతో పాటు కీలకమైన పోస్టులు ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. ప్రస్తుత శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవాకు నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఇన్‌చార్జిలు ఉండటంతో నీటిని అధికంగా తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. హంద్రీనీవా కాలవ 216 కిలోమీటరు జీడిపల్లి నుంచి కదిరి 400కిలోమీటర్ వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.936కోట్లు నిధులు మంజూరు చేసింది. పైగా కర్నూలు జిల్లా సరిహద్దు నుంచి 88కిలోమీటర్లు జీడిపల్లి కాలవ వెడల్పు పనులకు రూ.250కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నీ సక్రమంగా జరగాలంటే రెగ్యులర్ ఇంజనీరింగ్ అధికారులు ఉండాలి. అయితే ఆయా ప్రాంతాల్లో మొత్తం ఇన్‌చార్జి ఈఈలు, ఇన్‌చార్జి డీఈలే కొనసాగుతున్నారు.

హెచ్చెల్సీలోనూ అదే పరిస్థితి...

అనంతపురం జిల్లాకు ప్రధాన నీటి వనరైన టీబీపీ హెచ్చెల్సీలోనూ ఇన్‌చార్జ్‌ల పాలనే సాగుతోంది. హెచ్చెల్సీ డివిజన్‌లో రెగ్యులర్ ఈఈ శ్రీనివాసులు రెండు నెలల కిందట ఉద్యోగ విరమణ పొందారు. దీంతో నంద్యాలలో డీఈగా పనిచేస్తున్న శరత్‌బాబును డెప్యుటేషన్ కింద నియమించారు. ఇక డీబీసీ(ధర్మవరం బ్రాంచ్ కెనాల్) డివిజన్‌లో డీఈగా ఉన్న వెంకటరమణ జీబీసీ(గుంతకల్లు బ్రాంచ్ కెనాల్) ఇన్‌చార్జి ఈఈగా పని చేస్తున్నారు. వెంకటరమణ జీబీసీ ఇన్‌చార్జి ఈఈగా ఉన్నప్పటికీ వారంలో ఒక్కరోజు కూడా గుంతకల్లుకు వెళ్లడం లేదని, జిల్లా కేంద్రంలోనే తిష్ట వేసుకున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. హెచ్చెల్సీలో రూ.36కోట్లతో 11పనులు చేపడుతున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ అధికారులు ఉండటం వల్ల పనులలో జాప్యం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది. ఈఈలతో పాటు డీఈ పోస్టుల్లోనూ జేఈలే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతుండటం గమనార్హం. ప్రధానంగా టీబీ డ్యాం నుంచి ప్రస్తుతం నీటిని తరలిస్తున్నారు. కాలవ సరిహద్దు వెంబడి నీటి చౌర్యం లేకుండా, ఎక్కడా కాలువకు గండ్లు పడకుండా చూడాల్సిన బాధ్యత ఆయా ఇంజనీర్లదే. మరి ఇన్‌చార్జ్‌లు ఎంతమేరకు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



హంద్రీనీవా కార్యాలయం

మైనర్ ఇరిగేషన్‌లో ..

జలవనరుల శాఖలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోకే చెరువులు వస్తాయి. వీటి కట్టలను ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేసి, నీరు లీకేజీ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉంటుంది. హంద్రీనీవా, హెచ్చెల్సీ, వర్షం ద్వారా వచ్చే నీటితో ఆయా చెరువులను నింపుతూ ఎక్కడ గండ్లు పడకుండా, తెగిపోకుండా చూడాలి. ఇవన్నీ సమన్వయం చేసుకుని ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవాల్సిన బాధ్యత కీలకంగా ఉండే సూపరిండెంట్ ఇంజనీర్‌పైనే ఉంటుంది. ఈఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డి ఇన్‌చార్జి ఎస్‌ఈగా కొనసాగుతున్నారు. తాడిపత్రి డీఈగా ఉన్న రాము అనంతపురం ఐబీ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ధర్మవరం ఈఈగా ఉన్న నారాయణ నాయక్ నెల రోజుల కిందట ఎల్ఎల్‌సీ ఈఈగా బదిలీ కావడంతో హెచ్చెల్సీ డీబీసీ డివిజన్ ఈఈగా ఉన్న అబ్దుస్ సమీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

త్వరలో వస్తారు..



త్వరలో జలవనరుల శాఖ పరిధిలోని అన్ని కీలక పోస్టులను రెగ్యులర్ ఇంజనీర్లతో భర్తీ చేస్తారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరిపాలన సౌలభ్యం కోసం పలు పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ప్రమోషన్లు రావాల్సిన ఇంజనీర్లు చాలామంది ఉన్నారు. వారందరికీ ఉద్యోగోన్నతులు వస్తే అన్ని పోస్టుల్లోనూ రెగ్యులర్ అధికారులే ఉంటారు.

- నాగరాజ, జలవనరుల శాఖ జిల్లా ప్రాజెక్ట్ సీఈ



ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్వామివారు

సంగమేశ్వరుడికి అభిషేకం

కూడేరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం వేకువ జామునే జోడులింగాల సంగమేశ్వర స్వామికి అభిషేకం చేశారు. పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. కూడేరులో భోగి మంటలు వేసి వేడుకను సంబరంగా జరుపుకున్నారు. మూడు రోజులు పాటు జరిగే సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొలి రోజు భోగి మంటలు వేసి, రెండో రోజున ఇంటి ముందు అందమైన ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి, రైతులు పండించిన ధాన్యాన్ని అందులో పోసి ఇంటి గుమ్మడి కాయలను కొడతారు. మూడో రోజు కనుమతో ముగిస్తుంది.

రైతుల ఖాతాల్లోకి భూ పరిహారం


ఆంధ్రజ్యోతి
ఇంకా ఎన్నేళ్లు..?

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఉరవకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ కింద భూమి కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరైంది. ఏళ్ల తరబడి పరిహారం ఎదురు చూస్తున్న రైతుల గురించి గతంలోనే 'ఆంధ్రజ్యోతి'లో ఇంకా ఎన్నేళ్లు శీర్షికన ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భములు కోల్పోయిన రైతుల ఖాతాల్లోకి రూ.16.7కోట్లు జమ అయ్యాయి. హంద్రీనీవా ఉపకాలువ కోసం లత్తవరం గ్రామానికి చెందిన 30 మంది రైతుల నుంచి, 35ఎకరాల భూమిని సేకరించగా రూ.3.37కోట్ల పరిహారం రైతుల ఖాతాల్లోకి జమ అయ్యింది. అలాగే ఆమిద్యాల, సొల్లాపురం లిఫ్ట్ రైతులకు, పెద్దకౌకుంట్ల, పెద్దముష్టూరు రైతులకు రూ.13. కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే మంత్రి కేశవ్ నిధులు మంజూరు చేయించి, తన చిత్తశుద్ధిని చాటుకున్నారని రైతులు కొనియాడుతున్నారు.

అనంతలో శిక్షణ.. అద్భుత విజయం

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా రాష్ట్ర పురుషుల జట్టు



విజేతగా నిలిచిన ఏపీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అనంత వేదికగా శిక్షణ పొందిన ఏపీ పురుషుల జట్టు జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచింది. మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈనెల 11 నుంచి 13వతేదీ వరకు పాండిచ్చేరిలో 21వ సీనియర్స్ నేషనల్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కేరళపై మూడు పాయింట్ల తేడాతో గెలుపొందిన ఏపీ పురుషుల జట్టు విజేతగా నిలిచింది. మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్లను అనంతపురంలోనే ఎంపిక చేసి, ఇక్కడే శిక్షణ ఇచ్చారు. ఈ జట్లలో జిల్లాకు చెందిన క్రీడాకారులే ఎక్కువ ఉండటం గమనార్హం. రెండు జట్ల క్రీడాకారులను ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కూన రవికుమార్, నాగేంద్ర, సీఈఓ వెంకటేశులు అభినందించారు.

నలుగురు ఈఈలకు

అడహాక్ ప్రమోషన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో పనిచేస్తున్న నలుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా అడహాక్ పదోన్నతి కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ జీఓ నంబరు 12 జారీ చేశారు. ఇందులో ప్రధానంగా హెచ్చెల్సీలో డిప్యూటీ ఎస్‌ఈగా పనిచేస్తున్న సూర్యభాస్కర్ శర్మ, లోక్ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న రెడ్డి శేఖర్‌రెడ్డి, డీబీసీ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న అబ్దుస్‌సమీలతో పాటు మైనర్ ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా పనిచేస్తున్న ఈఈ విశ్వనాథ్‌రెడ్డిలకు అడహాక్ ప్రమోషన్ కల్పించారు. అయితే వీరికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్, హంద్రీనీవాలో ఎస్‌ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరి వీటిలో ఎవరికి అవకాశం కల్పిస్తారో చూడాలి. మైనర్ ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డి టీబీ డ్యాం ఎస్‌ఈగా వెళ్లేందుకు ఆసక్తి చూపుతూ, ఆదిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.

రేపు బ్యాంకులకు సెలవు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు ఈనెల 15న కనుమ సందర్భంగా సెలవు ప్రకటించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జీఓ నంబరు 73జారీ చేశారు. మొదట సంక్రాంతి పండుగకు ఈనెల 14వతేదీ ఒకరోజే బ్యాంకులకు సెలవు ప్రకటించారు. అయితే బ్యాంకు ఉద్యోగుల సంఘాల వినతి మేరకు బుధవారం కనుమ పండుగ రోజును సెలవుగా ప్రకటించారు.

అపరిచితుల మాటలు నమ్మొద్దు

- డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ సొమ్మును ఇప్పిస్తామని ఫోన్ చేస్తూ పలువురు మోసం చేస్తున్నారని, అలాంటి అపరిచితుల మాటలు నమ్మవద్దని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు సోమవారం ఓప్రకటనలో సూచించారు. ఇటీవల కొందరు ఆస్పత్రికి వచ్చే అమాయక రోగులే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థిక సదుపాయము ఇప్పిస్తామని మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అందుకే అపరిచితుల మాటలు నమ్మకూడదన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎవరికైనా అందే సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమ అవుతుందన్నారు. మీకేదైనా అనుమానం ఉంటే నేరుగా వచ్చి ఆస్పత్రిలో కలవాలని రోగులకు ఆయన కోరారు.

అగ్రిగోల్డ్ భూముల్లో మరో దోపిడీ

కలప అమ్మేందుకు రంగం సిద్ధం

పుట్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో మరో దోపిడీకి వైసీపీ నాయకుడు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈయన ఆ భూముల్లో వంద ఎకరాలకు పైగా సాగు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ భూముల్లో 60 ఎకరాల్లో ఏళ్ల తరబడి ఏపుగా పెరిగిన కంప చెట్లను కొట్టి కలపను అమ్మేందుకు సిద్ధం అవుతున్నాడు. దాదాపు 20 ట్రాక్టర్లకు పైగా కలప ఉన్నట్లు తెలిసింది. ట్రాక్టర్ కలప రూ.10వేలు చొప్పున విక్రయానికి పెట్టినట్లు సమాచారం. ఈమేరకు అనంతపురానికి చెందిన ఓ బట్టి వ్యాపారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీంతో ఆ వ్యాపారి ఇప్పటికే ఆ భూముల్లోని ఏపుగా పెరిగిన కంపచెట్లను పరిశీలించి వెళ్లినట్లు తెలిసింది. ఆ గ్రామంలో అగ్రిగోల్డ్ భూమి 217ఎకరాలు ఉంది. అక్కడ ఆ వైసీపీ నాయకుడు చెప్పిందే వేదం. ఆ భూముల్లోకి అధికారులు అయినా, ఇతర వ్యక్తులు ఎవరైనా రావాలంటే ఆయన అనుమతి ఉండాల్సిందే.

మోక్షమెప్పుడో..?

- ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా భవనాలు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు



కలుగోడులో ఆగిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

గుమ్మఘట్ట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నిధుల కొరతతో మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. వైసీపీ పాలనలో మండలంలో ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల నిర్మాణాలు ప్రారంభించారు. తొలుత సచివాలయ భవనాలకు రూ. 30 లక్షలు, ఆర్‌బీకే భవనాలకు రూ. 23 లక్షలు, హెల్త్ క్లినిక్‌లకు రూ. 20 లక్షల చొప్పున గత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలను ప్రారంభించారు. వీటికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఉపాధి నిధులను గ్రామ సర్పంచ్ నిధులతో అనుసంధానించి భవన నిర్మాణాలు ప్రారంభించారు. అయితే పంచాయతీలకు కూడా నిధులు కొరవడటంతో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోయారు. దీంతో కొన్ని నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. మండలంలో 15 గ్రామ సచివాల యాలు 90 శాతం పూర్తయ్యాయి. సచివాలయ సిబ్బంది వీటిలో అనధికారికంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పది పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది అద్దె భవనాలు, ఇతర పంచాయతీ కార్యాలయాలలో ఐదేళ్లుగా కార్యకలాపాలు కొనసాగిస్తూ వస్తున్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిపోయాయి. మండలంలోని గొల్లపల్లి, గలగల, కలుగోడు, బీటీపీ, రంగచేడు, 75 వీరాపురం, గోనబావి, గుమ్మఘట్ట గ్రామాలలో ప్రభుత్వ భవనాలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. పూలకుంట, బేలోడు, భూపసముద్రం, శిరిగేదొడ్డి గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తయినా వాటిని ప్రారంభించలేదు. అధికారులు మాత్రం వాటిని అనధికారికంగా వాడేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా నిధులను మంజూరు గ్రామ సచివాలయం, ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుమ్మఘట్టలో ఆగిన సచివాలయ భవనం

వినియోగంలోకి తేవాలి



గత ప్రభుత్వంలో ఆగిన ప్రభుత్వ భవనాలకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తిచేసి వినియోగంలో తేవాలి. గత పాలనకు నేటి పాలనకు ప్రజలు తేడా గుర్తించేలా వాటిని అభివృద్ధి చేయాలి.

- రవీంద్ర, గుమ్మఘట్ట

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు



గ్రామాల్లో అర్ధంతరంగా ఆగిన ప్రభుత్వ భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం భవన నిర్మాణాలు పూర్తి చేస్తే ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడుతుంది. భవనాలు వినియోగంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

- ఆంజనేయులు, జే వెంకటంపల్లి

ప్రజాధనం వృథా కాకూడదు



గ్రామాల్లో నిర్మించిన ప్రభుత్వ భవనాలకు లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించారు. అదంతా వృథా కాకుండా ప్రస్తుత ప్రభుత్వం వాటి నిర్మాణాలను పూర్తి చేసి, వినియోగించాలి. సర్పంచుల నిధులతో పూర్తి చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలి.

- రాజశేఖర్, వ్యాపారి, గుమ్మఘట్ట

భవనాలు పూర్తి చేస్తాం



గ్రామాల్లో 80 శాతం పూర్తయిన సచివాలయ భవనాలను పూర్తి చేసుకునేందుకు ఆయా సర్పంచులకు వెసులుబాటు కల్పించాం. మిగతా భవన నిర్మాణాలకు పూర్తి చేసేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. భవనాలను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణుడు, ఎంపీడీఓ, గుమ్మఘట్ట

మాయదారి మత్తు..!

- గంజాయి మత్తులో యువత
- స్పృహలేని స్థితిలో దారుణాలు
- పట్టించుకోని పోలీసులు.. ఇబ్బంది పడుతున్న ప్రజలు

తాడిపత్రి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోగంజాయి విక్రయాలు, వినియోగం జోరుగా సాగుతోంది. మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఈ గొడవలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. కొన్ని రోజుల కిందట నందలపాడు, టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్, కూరగాయల మార్కెట్, నంద్యాలరోడ్డు, పాతకోట, సుంకులమ్మపా లెం, విజయనగర్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఏటిగడ్డపాలెం తదితర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌పై పోలీసులు దాడులు చేశారు. కొందరిని మాత్రమే అరెస్ట్ చూపించి చేతులు దులుపుకున్నారు. యల్లనూరు రోడ్డులో గంజాయి బ్యాచ్ పట్టపగలే రాళ్లతో దాడులు చేసుకున్నారు. నంద్యాల రోడ్డులోని విశాల్‌మార్ట్ సమీపంలో కూడా దాడులు జరిగాయి. నెల కిందట కృష్ణాపురం జీరో రోడ్డులో కాలేజీ విద్యార్థినిని కామెంట్ చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న బేల్దార్లు శంకర్, సుబ్బరాయుడు, నాగేంద్ర మందలించారు. వారిపైనా గంజాయి బ్యాచ్ రాళ్లతో దాడి చేసింది. కృష్ణాపురం ఆరో రోడ్డులో గంజాయి బ్యాచ్ 40 రోజుల కిందట హల్‌చల్ చేయడంతో ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడి ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భగత్‌సింగ్‌నగర్‌లో నూతన ఇంటి నిర్మాణంలో గంజాయి బ్యాచ్ ఉన్న వీడియో వైరల్ అయింది. కానీ వారిని ఇంతవరకు అరెస్ట్ చేసిన పాపానపోలేదు. వీరికి అనంతపురం, గుంతకల్లు, బళ్లారి తదితర ప్రాం తాల నుంచి ఎక్కువగా రైలు మార్గంద్వారా గంజాయిసరఫరా అవుతోందని సమాచారం.

బయటికెళ్లాలంటే భయం

గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరడంతో విద్యార్థినులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. విద్యార్థినులను కళాశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులున జంకుతున్నారు. యల్లనూరు, కృష్ణాపురం జీరో రోడ్డు, పుట్లూరు రోడ్డు ప్రాంతాల్లో కాలేజీలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌ల సంచారం ఎక్కువైంది. కుటుంబ సభ్యులు వెంట వెళ్లి పిల్లలను కాలేజీల్లో వదలాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు కళాశాల నిర్వాహకులు పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. సిబ్బంది కొరతతో పోలీసులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా యల్లనూరురోడ్డు, కృష్ణాపురం జీరోరోడ్డు, పుట్లూరురోడ్డు ప్రాంతాల్లో కళాశాలలు ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతాల్లో గంజాయి తీసుకునే యువకులు నిత్యం సంచరిస్తు, వి ద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయితోపాటు తెల్లగా పౌ డర్ రూపంలో ఉన్న పదార్థాన్ని పీలుస్తూ కొంతమంది యువకులు మత్తు లో మునిగితేలుతున్నారు. దీంతో భయం, ఏమి చేస్తున్నామో అనే స్పృహ లేకుండా దాడులకు తెగబడుతున్నారు.



గంజాయి తీసుకుంటున్న యువకులు

రోడ్లపై ప్రమాదకరమైన బైక్ స్టంట్‌లు

పట్టణంలోని కొన్ని వీధుల్లో రాత్రిపూట గంజాయి బ్యాచ్ ద్విచక్రవాహనాలతో హల్‌చల్ చేస్తోంది. గంజాయి మత్తులో ఉన్న కొంతమంది పట్టణంలోని యల్లనూరు, సీబీ రోడ్డు, పుట్లూరురోడ్డు, నంద్యాలరోడ్డు ప్రాంతాల్లో బైక్ స్టంట్‌లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వాహనం కింద పడి ప్రమాదం జరిగితే వారితోపాటు సమీపంలో ఉన్నవారు కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఇప్పటికే బైక్‌స్టంట్‌లు నిర్వహించినవారు కిందపడి గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. ఎవరైనా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు వచ్చే సమయానికి వెళ్లిపోయి తిరిగి వచ్చి అదేపనిగా స్టంట్స్ చేస్తున్నారు. దీనంతటికి గంజాయి వంటి పదార్థాల సేవనమే కారణమని పలువురు పేర్కొంటున్నారు. కాగా బైక్‌స్టంట్‌లు చేసిన వారిపైన పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, అందుకే వారు మత్తులో రెచ్చిపోతున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం



తాడిపత్రి, పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడు జరిగిన కొన్ని సంఘటనల్లో అతిగా మద్యం సేవించి దాడులు చేశారని మా దృష్టికి వచ్చింది. వారిపైన కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించాం. సాయంత్రం వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తాం. సమస్య ఏదైనా మా దృష్టికి రాగానే చర్యలు తీసుకుంటున్నాం.

- రామకృష్ణుడు, డీఎస్పీ

ప్రమాదాల దారులు..!

దెబ్బతిన్న వంతెనలు .. కనిపించని రక్షణ దిమ్మెలు

చోద్యం చూస్తున్న అధికారులు



ధర్మవరం చివరి మరువ సమీపంలో దెబ్బతిన్న వంతెన

ధర్మవరం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాలు తిరిగే రహదారుల్లో ప్రమాదాలు పొంచి ఉన్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ధర్మవరం మండలంలోని ఏలుకుంట్ల, నేలకోట, దర్శినమల, నడిమిగడ్డపల్లి, బిల్వంపల్లి, ఓబుళనాయునిపల్లి, మల్లాకాల్వ, చిన్నూరుబత్తలపల్లి గ్రామ ప్రజలు నిత్యం ధర్మవరం చెరువు కట్ట కింద రహదారిలో ప్రయాణిస్తుంటారు. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ఆ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చెరువు కట్ట సమీపంలో చివరి మరువ సమీపంలో వంతెన కుంగి దెబ్బతింది. ఒకవైపు దెబ్బతినడంతో మరో వైపు మాత్రమే పోవాల్సి ఉంది. ఆ బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ దిమ్మెలు కూడా లేవు. ప్రస్తుతం చెరువు మరువలతో నీరు ఉధృతంగా పారుతోంది. వంతెన సమీపంలో ఒక పక్కభాగం పూర్తిగా దెబ్బతిని గుంత ఏర్పడింది. ఎదురుగా వాహనం వచ్చినా.. రాత్రివేళల్లో చూసుకోకుండా పోయినా ప్రమాదానికి గురికావాల్సిందే. ఆ గ్రామాల ప్రజలు ఆ రహదారి గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఆ వంతెన వద్ద ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొట్లూరు నుంచి తుమ్మల, సుబ్బరావుపేటకు వెళ్లే రహదారిలో గొట్లూరు వద్ద వంతెన దెబ్బతింది. గతంలో వర్షానికి కింద కల్వర్టు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం అక్కడ ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళనగా ఉందని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జిలను బాగు చేయాలని, ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేసి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గొట్లూరు నుంచి తుమ్మలకు వెళ్లే రహదారిలో దెబ్బతిన్న వంతెన

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

న్యాపతి సుబ్బారావు పంతులు (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు, 'ఆంధ్రభీష్మ'గా పేరొందిన న్యాపతి సుబ్బారావు పంతులు 1856 జనవరి 14న నెల్లూరులో జన్మించారు. సంస్కరణవాది, సాహితీవేత్త, పాత్రికేయుడు, రాజకీయ నాయకుడిగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజమండి సప్లయ్ కార్పొరేషన్‌ను స్థాపించి విద్యుత్ ఉత్పాదన చేయడమే కాక తొలిసారిగా రాజమండ్రికి విద్యుత్ సరఫరా చేశారు. కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా ఉండేవారు. వివేకానందుని స్ఫూర్తితో సనాతన ధర్మప్రచారానికి కృషి చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు వ్యవహరించారు. 1941 జనవరి 15న కన్నుమూశారు.

సీడీ దేశ్‌ముఖ్ (జయంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత సర్ చింతమన్ ద్వారకనాథ్ దేశ్‌ముఖ్ 1896 జనవరి 14న మహారాష్ట్రలోని రాజ్‌ఘడ్ ప్రాంతంలో జన్మించారు. బ్రిటీష్ వారిచే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమితులైన తొలి దేశీయ సివిల్ సర్వెంట్. 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్'గా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ఆర్థికమంత్రిగా వ్యవహరించారు. రామన్ మెగసెసె అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. 1982 అక్టోబరు 2న కన్నుమూశారు.

ఆర్‌కే శ్రీకంఠన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత రుద్రపట్టణ కృష్ణశాస్త్రి శ్రీకంఠన్ 1920 జనవరి 14న హాసన్ జిల్లా రుద్రపట్టణలో సంగీతకారుల కుటుంబంలో జన్మించారు. శృతి, లయ, సాహిత్యంపై అపారమైనజ్ఞానం కలిగి ఆలిండియా రేడియోలో ఫస్ట్‌గ్రేడ్ కళాకారుడిగా, సంగీత ప్రాయోజకులుగా 32ఏళ్లపాటు సేవలందించారు. జాతీయ, అంతర్జాతీయ కచేరీలలోనే కాక దేశవ్యాప్తంగా పర్యటించి సంగీత ఉపన్యాసాలు చేశారు. సంగీతనాటక అకాడమీ అవార్డ్, సంగీత కళానిధి, కనక-పురందర, గాన కళా ప్రవీణ తదితర అవార్డులు పొందారు. 2014 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

కేబీ తిలక్ (జయంతి)



కొల్లిపర బాలగంగాధర తిలక్ 1926 జనవరి 14న పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ప్రాంతంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు. ప్రజానాట్య మండలిలో సభ్యుడిగా చేరి నాటకాలు ప్రదర్శించారు. అనంతరం సినీరంగ దర్శకుడిగా, నిర్మాతగా మారారు. అనుపమ చిత్ర బ్యానరుపై అభ్యుదయ భావాలతో సినిమాలు రూపొందించారు. 'భూమికోసం' సినిమా ఎంతో పేరొందింది. గాయని ఎస్ జానకి, నటి జయప్రదను వెండితెరకు పరిచయం చేశారు. 2008లో బీఎన్‌రెడ్డి పురస్కారం అందుకున్నారు. 2010 సెప్టెంబరు 23న కన్నుమూశారు.

శోభన్‌బాబు (జయంతి)



'శోభన్‌బాబు'గా పేరొందిన ఉప్పు శోభనా చలపతిరావు 1937 జనవరి 14న కృష్ణా జిల్లా చిన నంది గామలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో కథా నాయకుడిగా కుటుంబ కథాభరితమైన, ఉదాత్తమైన వ్యక్తిత్వ కలిగిన పాత్రలలో రాణించారు. ప్రేమ కథలలో విశిష్టమైన స్థానాన్ని పొంది ఆంధ్రుల అందాలనటుడిగా తెలుగువారి మదిలో నిలిచారు. నటభూషణ, సోగ్గాడు, ఆంధ్రా అందగాడు బిరుదులు ఉన్నాయి. 220కుపైగా సినిమాలలో నటించినా క్రమశిక్షణతో కూడిన జీవితానికి నిదర్శంగా నిలిచారనే పేరొందారు. 59వ ఏట నటనకు స్వస్తి పలికారు. 2008 మార్చి 20న కన్నుమూశారు.

రావుగోపాలరావు (జయంతి)



నటుడు రావుగోపాలరావు 1937 జనవరి 14న జన్మించారు. నాటక రంగం నుంచి వెండితెరపైకి వచ్చారు. 'ముత్యాలముగ్గు' సినిమాలో కాంట్రాక్టర్ పాత్రతో ఆయన జీవితం మారిపోయింది. తెలుగు సినిమా విలనీలోనే కొత్తదనానికి రూపునిచ్చారు. దక్షిణ ఆసియాలో సినిమా సంభాషణలు సౌండ్‌ట్రాక్‌తో విడుదలైన తొలిలాంగ్ ప్లే రికార్డు 'ముత్యాలముగ్గు' సినిమాలో రావు గోపాలరావుది కావడం ఒక రికార్డు. తెలుగు ప్రతినాయకుల్లో 'నటవిరాట్'గా నిలిచారు. కళాప్రపూర్ణ, నంది ఇతర అవార్డులు పొందారు. రాజ్యసభ సభ్యుడిగాను వ్యవహరించారు. 1994 ఆగస్టు 13న కన్నుమూశారు.

జంధ్యాల (జయంతి)



సినీరంగంలో 'హాస్యబ్రహ్మ'గా పేరొందిన జంధ్యాల వీరవెంకట దుర్గా శివసుబ్రమణ్య శాస్త్రి 1951 జనవరి 14న నరసాపురంలో జన్మించారు. తెలుగు సినీరంగంలో స్క్రీన్ రైటర్‌గా, దర్శకుడిగా, నటుడిగా తనదైన గుర్తింపు పొందారు. 24ఏళ్ల కెరీర్‌లో నాలుగు నంది, ఒక ఫిల్మ్‌ఫేర్ అవార్డు పొందారు. సినిమాలలో హాస్యానికి ట్రెండ్ తేవడమే కాక, పలువురు హాస్యనటులను వెండితెరకు పరిచయం చేశారు. ఆనందభైరవి సినిమాకు ఉత్తమ దర్శకుడిగాను, నంది అవార్డుకూడా పొందారు. 2001 జూన్ 19న గుండెపోటుతో కన్నుమూశారు.

నేడు యర్రాయపల్లిలో మంత్రి పర్యటన

బత్తలపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రా యపల్లిలో మంగళవారం వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పర్యటిస్తున్నట్లు తెలుగు రైతు సంఘ నియోజకవర్గం నాయకులు చల్లా శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించడానికి మంత్రి సత్యకుమార్‌తో పాటు ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జు పరిటాల శ్రీరాం హజరు అవుతున్నట్లు తెలిపారు. కావున మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని తెలిపారు.

భోగిభాగ్యాలు కలగని..!



చింతామణిలో చెరుకుగడల విక్రయాలు

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పల్లె సంప్రదాయంతో ఖరీఫ్‌లో పండించిన కొత్త పంటల దిగుబడులతో సంతృప్తికరంగా చేసుకునే సంక్రాంతి పండుగ వచ్చింది. రాష్ట్రమంతటా కొత్త శోభను తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎటు చూసినా సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో చలి ప్రభావం పెరగడంతో ప్రతిచోటా భోగిమంటలు వేశారు. రాష్ట్రంలో సంక్రాంతికి ప్రాంతాలవారీగా వేర్వేరు సంప్రదాయాలతో వేడుకలు చేసుకుంటారు. ప్రసిద్ధమైన గవిగంగాధరేశ్వరస్వామి ఆలయంలోని మూలవిరాట్టుపై సూర్యకిరణాలు పడే అపురూపమైన సంఘటన చూసేందుకు భక్తులు వేచి ఉన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇళ్లల్లో ప్రత్యేక పూజలు, ఆలయాలలో ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సంక్రాంతి పండుగన వేరేశనగ, అనప, చిలగడదుంప, పసుపు పిలకలు, చెరుకుగడలతో పూజలు చేసి నైవేద్యంగా పెడతారు. ఇలా మార్కెట్‌లో సంక్రాంతి వస్తువుల కొనుగోళ్లకు కిటకిటలాడాయి. ఇంటింటా నువ్వులు, బెల్లం ఒకరికొకరు ఇచ్చి ఆశీస్సులు పొందే సంప్రదాయం రాష్ట్రమంతటా వేడుకగా చేసుకుంటారు. కాగా గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, కేంద్రమంత్రి కుమారస్వామిలు రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రప్రజలకు సంక్రాంతితో మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

పట్టణాలలోనూ సంక్రాంతి సంబరాలు

చింతామణి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పంట చేతికొచ్చేవేళ గ్రామాలలో జరుపుకొనే సంక్రాంతి సొబగులు పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా సందడి తెచ్చింది. దక్షిణాయనం ముగిసి ఉత్తరాయన కాలం సూచికగా సంక్రాంతితో ప్రారంభమవుతుంది. మీనం నుంచి మేషం వరకు రాశులు ఉండగా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణంగా వ్యవహరిస్తారు. సూర్యుడు ఒక్కోరాశిలో ప్రవేశించి ప్రయాణించడానికి సుమారు ఒక నెల సమయం పడుతుంది. ఉపనిషత్తుల ప్రకారం సద్గతులు లభించేందుకు భీష్మాచార్యుడు సైతం ఉత్తరాయనం వరకు వేచి ప్రాణాలు వీడారు. సంక్రాంతి పండుగను ఒక్కోరాష్ట్రంలో ఒక్కో తరహాలో వైభవంగా ఆచరిస్తారు. మహారాష్ట్ర, గుజరాత్‌లలో గాలిపటాలు ఎగురవేసి పోటీలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగకు వచ్చిన చెరుకుగడలు, అనప, చిలగడదుంప, కొత్త బెల్లం వంటి వాటికి పూజలు చేసి వాటితో చక్కటి వంటకం చేసి బంధుమిత్రులకు పంచుకునే ఆనవాయితీ ఉంది. పట్టణంలో చెరుకు గడల విక్రయాలు జోరుగా సాగాయి.

జీవితంలోనూ సంక్రాంతి రావాలి

విజయపుర: మనజీవితాలలో సంక్రాంతి శోభ రావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జేఎస్ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రగతి ఆంగ్ల పాఠశాల ఆవరణలో సోమవారం సంక్రాంతి వేడుకల్లో పాల్గొని విద్యార్థులలో స్ఫూర్తి కలిగించేలా ప్రసంగించారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. గాలిపటాలు ఎగుర వేశారు. విద్యార్థులందరికీ నువ్వు లు, బెల్లం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ప్రగతి పీయూ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్, ఐటిఐ ప్రిన్సిపాల్ హరీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట: పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. సోమవారం పండుగకు అవసరమైన కొనుగోళ్లకు దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. పూలు, పండ్లు, చెరుకుగడలు, కూరగాయలు ఇతర సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. ఈసారి జిల్లాలో మంచి పంటలు సాధ్యం కావడంతో నాణ్యమైన వేరుశనగ, కొబ్బరి, నువ్వులు లభిస్తున్నాయి. అనప కిలో రూ.60, కీరదోస కిలో రూ.30-40, బఠాని రూ.45, టమోటా రూ.30వరకు ధర పలికింది. చెరుకుగడ ఒకటి రూ.70-80 వరకు ధర పలకడం గమనార్హం. నువ్వులు, బెల్లం ధరలు పెరిగాయి.

శిడ్లఘట్ట తాలూకాలో...

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా సంక్రాంతికి ఎటు చూసినా సందడి నెలకొంది. మార్కెట్‌లలో చెరుకుగడలు, పూల విక్రయాలు జోరుగా సాగాయి. పాఠశాల, కళాశాలల్లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి వైభవాన్ని చాటే కార్యక్రమాలలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



విజయపుర ప్రగతిపాఠశాలలో సంక్రాంతి సంబరం



బంగారపేట మార్కెట్‌లో విక్రయాలు



శిడ్లఘట్టలో సంక్రాంతి సందడి ఇలా...

యువ విద్యార్థులు మార్పు దిశగా ప్రయత్నించాలి

▸▸ పీఈఎస్ సదస్సులో యూఎస్ బిజినెస్ గ్లోబల్ లీడర్ గ్రెగొరి ప్రొఫెటా

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మేనేజిమెంట్ కోర్సులకు విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉందని యువ విద్యార్థులు మార్పుదిశగా ప్రయత్నించాలని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా బిజినెస్ గ్లోబల్ లీడర్ గ్రెగొరి ప్రొఫెటా అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీలో పవర్స్ లీడ్ వాల్యూస్ డైవర్స్ లీడర్‌షిప్ టెక్ ఫర్ చేంజ్ గుడ్ అనే అంశాలపై చర్చాగోష్టి జరిగింది. యూఎస్ పీడబ్ల్యుసి ప్రతినిధిగా గ్రెగొరి ప్రొఫెటా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తమమైన నైతిక విధానాలతో వినియోగదారులకు మేలు చేకూర్చేలా మేనేజిమెంట్ విభాగాలు పాటుపడాలన్నారు. ఆడిట్, పన్నులు, సలహాకేంద్రాలు కంపెనీలకు స్తంభాలవంటివన్నారు. చార్టెర్డ్ అకౌంటెంట్‌లు పెట్టుబడుల మార్కెట్‌కు నమ్మకాన్ని తీసుకొస్తారన్నారు. ఏఐ ఆధారిత సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హరికుమార్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్, అడ్మినిస్ట్రేషన్, కామర్స్ విభాగం డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు వేదికపై ప్రముఖులు

ఉత్సాహంగా అట్టగుణి



పూజల్లో పాల్గొన్న చిన్నారులు, సంఘం నిర్వాహకులు

విజయపుర, జనవరి 13(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని అయోధ్యానగర శివాచార్య వైశ్యనగర్త మహిళాసంఘం ఆధ్వర్యంలో నగరేశ్వరస్వామి ఆలయ జ్ఞానమందిరంలో అట్టగుణి కార్యక్రమం నిర్వహించారు. పుష్యమాసం పున్నమిని పురస్కరించుకుని పన్నెండేళ్లలోపు బాలికలకు సంప్రదాయంగా హారతి ఇచ్చే సంప్రదాయాన్ని కొన్నేళ్లుగా పాటిస్తున్నట్టు మహిళాసంఘం నిర్వాహకులు తెలిపారు. పసుపుతో గౌరమ్మను సిద్ధం చేసి బియ్యపుపిండితో దీపాలను వెలిగించారు. ఊరి సరిహద్దున, తిప్పమ్మ, గాగనుగలకు పూజలు చేశారు. నగర్త మహిళా సంఘం అధ్యక్షురాలు లీలా రుద్రమూర్తి, ఉపాధ్యక్షురాలు భారతి విశ్వనాథ్, కార్యదర్శులు భారతి ప్రభుదేవ్, కోశాధికారి శ్వేతా మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవకు కృషి చేయాలి

దొమ్మసంద్ర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా హెన్నాగర గ్రామపంచాయతీ పరిధిలోని వీఎస్‌ఆర్ లే అవుట్‌లోని ప్రైవేట్‌సంస్థల కార్మికులంతా చేరి స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఇదే సందర్భంగా స్వామి వివేకానంద శ్రమజీవి సంఘాన్ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మొక్కలు నాటారు. బెస్ట్ హాస్పిటల్ యజమాని విజయ రాఘవరెడ్డి మాట్లాడుతూ వివేకానంద ఆదర్శాలు నేటికీ ఆదర్శనీయమన్నారు. యువ సాహితీవేత్త నాగలేఖ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ వంతు సమాజానికి ఎంతోకొంత సేవ అందించాలన్నారు. గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం ఏర్పాటుకే పరిమితం కాకుండా సమాజసేవా కార్యక్రమాలతో క్రియాశీలకంగా ఉండాలని సూచించారు. ఇదే సందర్భంగా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి స్థానికులకు పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పిల్లలందరికీ లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డు పోలీసు అధికారి వి మంజునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చన్న స్వామి చంద్రశేఖర్, సంఘం పదాధికారులు పాల్గొన్నారు.



లేఖనా సామగ్రితో చిన్నారులు

లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షోకు కసరత్తు



పూల మొక్కలతో ఏర్పాట్లు

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యాన వనం మరోసారి పూల ప్రదర్శనలకు సిద్ధమవుతోంది. ఏటా సందడి అనిపించేలా సాగే ప్రదర్శనలను తిలకించేందుకు రాష్ట్ర ప్రజలేకాకుండా ఇతర ప్రాంతాలనుంచి కూడా వస్తుంటారు. రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని వాల్మీకి మహర్షి రూపంలో ఏర్పాటవుతున్న ప్రదర్శనకు కసరత్తు జోరందుకుంది. ఈ నెల 16నుంచి పదిరోజులపాటు ప్రదర్శనలు కొనసాగనున్నాయి.



గ్లాస్‌హౌస్‌లో ఏర్పాట్లు ఇలా..

బాలయ్య కటౌట్‌కు గజమాలలు

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నం దమూరి బాలకృష్ణ నటించిన డాకు మహరాజ్ సినిమా విజయవంతమైనందుకు బెంగళూరు సిటీ ఫ్యాన్స్ సంబరాలు చేసు కున్నారు. నగరం లోని భూమికా థియేటర్ వద్ద 63 అడుగుల కటౌట్‌ను ఏర్పాటు చేసి గజ మాలలు వేశారు. సినిమాకు హిట్‌టాక్ వచ్చిందని ఇదే సంబర మని తెలిపారు. థియేటర్ వద్ద అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భారీ కటౌట్ ఇదే...

విద్వేషాలకు ప్రభుత్వ వైఖరే కారణం

● మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప ధ్వజం
● కాంగ్రెస్ సర్కార్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వరప్ప

రాయచూరు జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తరచుగా సాగుతున్న విద్వషాలు, తలెత్తుతున్న అశాంతికి కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలేనని మాజీ మంత్రి బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ ఈశ్వరప్ప ఆరోపించారు. ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకున్న పలు పరిణామాలు ప్రభుత్వ పెద్దల అనుచిత వ్యాఖ్యాల వల్లేనని ఆయన స్పష్టం చేశారు. ఆవుల పొదుగులను కోయడం అందులో భాగమేనని ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి ఈశ్వరప్ప, సోమవారం నగరంలో కొద్దిసేపు విలేఖరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో రూపుదిద్దుకున్న గో హత్య నిషేధ చట్టాన్ని పశుబలి చట్టాలను నిర్వీర్యం చేస్తు వాటిని రద్దు చేయనున్నట్లు ప్రభుత్వ ప్రకటించడం వల్లే ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నుంచి తప్పుడు సంకేతాలు వెలువడుతుండడం వల్లే వివిధ రకాల మూకలు చెలరేగిపోతున్నాయని ఆరోపించారు. తాను బీసీ నాయకుడినంటు ఇటీవల పలు సందర్భాల్లో గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తమ స్వంత కులస్తులను కలిసేందుకు కూడా ఇష్టపడడం లేదని ఈ విషయంలో సాక్షాత్తు కాగినెలె పీఠాధిపతి శివానంద స్వామి అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని ఈశ్వరప్ప ప్రస్తావించారు. కేవలం కులం,మతం పేర్లను కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసమే వాడుతున్నారని నిజంగా ఆయా కులాల పట్ల జాతుల పట్ల ఆ పార్టీకి నాయకులకు ఎలాంటి నిబద్ధత లేదన్నారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీల్లో కులం పేరుతో నాయకత్వాలు ఉంటాయని చెప్పుకోవడం పట్ల మాజీ మంత్రి అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఇప్పటికే బీసీలంతా సిద్ధరామయ్య గ్రూప్‌గా ఒక్కలిగలు డీకే శివకుమార్ గ్రూపులుగా వీడిపోయి ప్రజల్లో అసంతృప్తికి కారణమైయ్యారని ఇది కాంగ్రెస్ సంస్కృతి అని మాజీ మంత్రి అన్నారు. విధాన పరిషత్‌లో బీజేపీ నాయకుడు సీటీ రవి, మంత్రి లక్ష్మి హెబ్బాళ్‌కర్ వ్యవహారానికి సంబంధించి సభాపతి ఇచ్చిన రూలింగ్‌ను ప్రభుత్వం పెడిచెవన పడుతుండడం బాధ్యతారాహిత్యమన్నారు. ఒకవైపు రాజ్యాంగ పరిరక్షణ తమ ఉద్దేశమంటునే సభాపతి స్థానాన్ని అగౌరవ పరచడం ఏ పాటి విలువలని ఈశ్వరప్ప ప్రశ్నించారు.

దర్వేష్ గ్రూప్ మోసంలో నిందితుడి అరెస్టు

రాయచూరు జనవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో డిపాజిట్‌ల పేరుతో పెద్ద ఎత్తున ప్రజల నుంచి సొమ్ము సేకరించి మోసగించిన దర్వేష్ గ్రూప్ కంపెనీ నిందితుల్లో 12వ వాడైన అస్లంను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం న్యాయస్థానానికి అప్పగించారు. దర్వేష్ గ్రూప్ కంపెనీ పేరుతో ఏర్పాటు చేసిన ఫైనాన్స్ కంపెనీలో అధిక వడ్డీ ఆశా చూపి ప్రజ నుంచి పెద్ద మొత్తం వందల కోట్ల రూపాయిల మేరకు డిపాజిట్‌లు సేకరించారు. డిపాజిట్ సొమ్ము మెచ్యూరిటీ డేట్ ముగిసినా సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో మోసపోయామని తెలుసుకున్న ఒక్కరుగా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో గత ఏడాది జూన్ 22న జిల్లా పోలీసులు (సీఈఎన్) కేసు నమోదు చేశారు. వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం దీని పై సమగ్ర విచారణ కోసం సీఐడీని ఆదేశించింది. ఈ క్రమంలో నిందితులందరూ తప్పించుకోక నలుగురు మాత్రం పోలీసులకు పట్టుపడగా మిగితా వారంతా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ క్రమంలో 12వ నిందితుడిగా పేర్కొన్న అస్లంను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని న్యాయస్థానానికి అప్పగించారు. నిందితులుగా ఉన్న వారంతా న్యాయస్థానం నుంచి ముందస్తు బెయిల్ కోసం చేసిన దరఖాస్తులను ఇప్పటికే కోర్టులో తిరస్కరించగా ఇటీవలే ఒక్కొక్కరుగా నిందితులు పోలీసులకు పట్టుబడుతుండడం గమనార్హం. కాగా అసలు ముద్దాయి మహ్మద్ హుసేన్ సుజా ఇప్పటి వరకు ఎక్కనున్నాడు..? ఏమి చేస్తున్నాడో..? అనే దాని పై పోలీసులకు సమాచారం అందడం లేదు. దీని పై ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీని కనుగునేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తిరిగిరాని సంక్రాంతి..!

ఒక్కరి మరణంతో ఆగిన పండుగ
వేడుకలకు దూరం..
బోదపాటి వంశం

ఆత్మకూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ. బంధుమిత్రుల రాకతో ఇంటికి కొత్త కళ వస్తుంది. ముత్యాల ముగ్గులు పరుచుకున్న నేల.. ఎగిరే గాలి పటాల ఆకాశం ఏకమౌతాయి సంక్రాంతికి. కానీ ఆత్మకూరు మండలంలోని పి.కొత్తపల్లికి చెందిన ఒక వంశంవారు ఈ సంబరాలకు తరతరాలుగా దూరంగా ఉంటున్నారు. పండుగ సరుకులకోసం వెళ్లిన ఒకరు తిరిగిరాని లోకాలకు వెళ్లడమే దీనికి కారణం. బోదపాటి వంశానికి చెందిన ఆ వ్యక్తి మరణంతో ఇప్పటికీ పండుగను చేసుకోవడం లేదు. పండుగ జరపుకుంటే తమకు కీడు జరుగుతుందని వారు నమ్ముతారు. అందుకే తమ పూర్వీకుల నుంచి సంబరాలకు దూరంగా ఉంటున్నామని ఆ వంశస్థుల్లో ఒకరైన బోదపాటి వెంకటేసులు అన్నారు. 'సంక్రాంతి పండుగకు పిండి వంటలు చేసుకోము. ఇంటి ముందు ముగ్గు వేయం. కొత్త బట్టలు కొనుగోలు చేయం. ఊరంతా పండుగ చేసుకుంటున్నా.. మేము పండుగ జోలికి వెళ్లం..' అని ఆ కుటుంబాలవారు అంటున్నారు. 'మా వంశంలో ఆడపడుచులు పెళ్లి చేసుకుని వెళ్లాక.. అత్తారింటిలో పండుగ చేసుకుంటారు. కానీ ఈ ఇంటికి వచ్చిన కోడళ్లు ఆచారం ప్రకారం పండుగకు దూరంగా ఉంటాం..' అని అనసూయమ్మ అనే మహిళ అన్నారు. తమ వంశీయులు వేర్వేరు ప్రాంతాలలో స్థిరపడ్డారని, ఎక్కడున్నా ఆచారాన్ని కొసాగిస్తున్నారని తెలిపారు.



పి కొత్తపల్లి గ్రామం

పండుగ చేయం...




మా ఊరిలో నా చ్చిప్పటి నుంచి పండుగ చేయడం లేదు. సంక్రాంతికి దూరంగా ఉండాలని మా పెద్దలు నిర్ణయించారు. వారి మాటలకు కట్టుబడి ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. మా వంశస్థులు అందరం పాటిస్తున్నాం. **- బోదపాటి వెంకటేసులు**

పుట్టింటి సంక్రాంతే చివరిది..



మా పుట్టింట్లో ఉండగా సంక్రాంతి చేసుకున్నాను. పెళ్లి చేసుకుని అత్తవారి ఇంటికి వచ్చాక పండుగ చేయలేదు. నా భర్త కుటుంబం ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. మా పిల్లలు కూడా పాటిస్తున్నారు. సంక్రాంతికి మా ఇంటి ముందు ముగ్గులు ఉండవు. రెండు రోజులపాటు కఠినంగా నియమాలు పాటిస్తాం. **- అనసూయమ్మ**



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.34	1,588.98
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.198	0
నీటి నిల్వ (టీఎంసీలు)	71.20	10.18



ఎమ్మిగనూరులో గంగిరెద్దు

సంబరంగా భోగి

కంప్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో మొదటిరోజైన భోగిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. క్యాంపుల్లో, గ్రామాల్లో ఇంటింటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి పండుగ చేసుకున్నారు. గ్రామాల్లో గంగిరెద్దులు సందడి చేశాయి. పిల్లలు పతంగులు ఎగురవేసి కేరింతలు వేశారు. మంగళవారం సంక్రాంతి సంబరాలకు అందరూ సిద్ధమయ్యారు.



క్యాంపుల్లో భోగి మంటలు వేసిన మహిళలు

ఘనంగా ఖాసీమ్ వలీ తాత ఉరుసు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

సిరుగుప్ప, జనవరి 13(ఆంధ్ర జ్యోతి): ఖాసీమ్ వలీ తాత ఉరుసును సోమవారం ఘంగా నిర్వహించారు. హళేకోట గ్రామంలో మూడు రోజుల పాటు గంధం, ఉరుసు, జియారత్ కార్యక్రమాలు చేపట్టారు. ముస్లిం గురువులు ఖురాన్ పఠించారు. పలువురు దర్గాను దర్శించుకున్నారు.

పాడి రైతులకు సహకారం

కంప్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పాడి పరిశ్రమపై అవగాహన వుండే వారికి ప్రభుత్వం ఎప్పుడూ సహకరిస్తుందని పశుశాఖ జిల్లా డైరెక్టర్ ఎంసీ వినోద్‌కుమార్ తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో 2024-25 సంవత్సరం నాటి తాలుకాలో పాడి పరిశ్రమపై అవగాహన వుండే పలువురిని గుర్తించారు. వారికి సామాగ్రి, క్యాన్, కిట్‌తో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వీరితో పాటు శ్రీనివాస్ డాక్టర్ బసవరాజు, మంజునాథ్, నాగరాజు, శివప్ప, రాధ, శంకరమ్మ, రేణుకమ్మ, పీరాసాబ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికైనా సారొస్తారా..?

● నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని మాజీ మంత్రి నాగేంద్ర ● పదవి పోయాక కానరాని నేత ● సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో..ప్రతిపక్షాలతో పాటు సొంతపార్టీలోనూ విమర్శలు



బళ్లారి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అత్తమీద కోపం దుత్తమీద చూపడం అంటే ఇదేనేమో.! బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్రకు ఎస్టీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి అరోపణల నేపథ్యంలో మంత్రి పదవి నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షం కూడా ఎస్టీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి పై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా ఎస్ఐటి కూడా నాగేంద్రను అరెస్టు చేసి జైల్లో వేసింది. అయితే జైల్లో నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా నాగేంద్ర నియోజక వర్గం వైపు కన్నెత్తి చూడలేదు. మంత్రి పదవి తిరిగి వచ్చే వరకు బళ్లారిలో కాలు మోపనని నాగేంద్ర శపథం చేశారని ఆయన సన్నిహిత వర్గం ద్వారా ప్రచారం సాగుతోంది. ఆరేడు నెలలుగా ఆయన ప్రజల్లోకి వచ్చిందే లేదు. ఒకప్పుడు తన నియోజక వర్గంలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా, ఏ చిన్న ఘటన జరిగినా తక్కున హాజరయ్యే ఎమ్మెల్యే ఇప్పుడు దూరం కావడం అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. అయితే మంత్రి పదవి లదేని ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు దూరంగా ఉంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని వాపోతున్నారు. బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతల మరణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయింది. ప్రతిపక్షాలు, అధికార పక్షాలు, ప్రజా సంఘాలు, మానవ హక్కుల కమిషన్, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు ఇలా అన్ని వర్గాల వారు బాలింతల మరణం పై ఆందోళన చేశారు. ఇక రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్ ఇలా అందరూ మరణించిన బాలింతల గ్రామాలకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించారు. కానీ ఎమ్మెల్యే నాగేంద్ర సొంత నియోజక వర్గంలో ఇంత జరిగినా కనీసం పలకరించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల్లో ఇన్ని సమస్యలున్నా అడుగు మోపడం లేదని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. కొందరు సొంత పార్టీ నేతలు కూడా ఆయనపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక సంక్రాంతి పండుగకు దేశ విదేశాల్లో ఉండే ఎంతో మంది తమ సొంత ఊర్లకు వస్తున్నారు. కనీసం సంక్రాంతికైనా సారొస్తారా అని ఎదురు చూస్తున్నారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

● నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాలా ప్రాణాలకు రక్షణ కల్పించాలి ● కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నిరసన



కలెక్టర్ కార్యాలయం ముందు నిరసనలో రైతునాయకులు

బళ్లారి సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకలెక్టర్ కార్యాలయం దగ్గర సోమవారం ఐక్యపోరాట కర్ణాటక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకులు గోవింద్, శంకర్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ఢిల్లీ రైతాంగ పోరాటాన్ని పునరుద్ధరించిన సందర్భంగా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉపవాస సత్యాగ్రహం చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నిరాహారదీక్ష చేస్తున్న సింగ్ ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సీనియర్ రైతు నాయకుడు జగజిత్‌సింగ్ రైతుల జీవితాలను రక్షించడానికి చర్య తీసుకోవాలి. వెంటనే సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నాయకత్వంతో చర్చలు ప్రారంభించాలి, ఢిల్లీసరిహద్దుల్లోని పోరాటాలతోరైతులందరి వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర హామీ చట్టం అమలు చేయాలన్నారు. అన్ని రకాల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలన్నారు. విద్యుత్తు ప్రైవేటీకరణ చేయకూడదన్నారు. వివిధ చోట్ల పంప్‌సెట్ల మీటరింగ్‌ను తక్షణమే ఆపాలన్నారు. 60ఏళ్ల పైబడిన రైతులందరికీ నెలకు రూ. 5000 పింఛన్ ఇవ్వాలన్నారు. చారిత్రాత్మకమైన ఢిల్లీ రైతు పోరాటం ద్వారా వచ్చిన డిమాండ్లలన్నింటినీ నెరవేర్చాలని, వ్యవసాయ మార్కెట్ జాతీయ ఫ్రేమ్ వర్క్ పాలసీని రైతు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు లేపాక్షి, సంగనకల్లు కృష్ణప్ప, అరుణ్, గురల్లిరాజా తదితరులు ఉన్నారు.

వైభవంగా బనశంకరీ దేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారిరూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని సిడిగినమల గ్రామంలో బనశంకరి దేవి మహారథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో రథాన్ని భక్తులు లాగారు. బనశంకరి దేవి దేవస్థానం నుంచి వీర బసవన్న దేవస్థానం వరకు రథాన్ని లాగారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తాదులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా బనశంకరి దేవిని మాజీ మంత్రి శ్రీరాములు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు ఓబుళేసు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి శ్రీరాములు

చిప్పిగ సమాజం అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చిప్పిగ సమాజం వారు ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో శంకరలింగ ఆలయం నిర్మాణం చెంది పదేళ్లు అయిన సందర్భంగా దశమానత్వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ ప్రతి మనిషి భక్తితో పాటు విద్యపై కూడా దృష్టిసారిస్తే దేశాభివృద్ధి చెందుతుందన్నారు. పల్లెల్లో ధార్మిక కార్యక్రమాలతో సమైక్యత వెల్లివిరుస్తుం దన్నారు. సమైక్యంగా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వీరేశప్ప, గాదెలింగప్ప, లక్ష్మణ్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు ఐనాథ్ గణపాల్ రెడ్డి

ఆవు పొదుగులు కోసిన వారిని శిక్షించాలి

● బీజేపీ నాయకుల డిమాండ్

బళ్లారి సిటీ,జనవరి 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని చామరాజపేట సమీపంలోని ఓల్డ్ పెన్స్ ఎస్ మొహల్లాలో మూడు ఆవుల పొదుగులను కోసి వాటిని హింసంచిన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీజేపీ రైతు మోర్చా అధ్యక్షుడు గణపాల ఐనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

నగరంలోని బీజేపీ జిల్లాకార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంతు ఆసుపత్రికి దాతలు ఇచ్చిన భూమి వక్ఫ్‌కు చెందుతుందని చెప్పడంతో... ఈ గోవులతో నిరసన తెలిపారు. అందుకోసం నిందుతుల ఈ ఆవుల పొదుగు కోశారన్నారు. ఈనేరానికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. గోశాలలను తెరవడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రాంట్లు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కేవలం 15గోశాలలను మాత్రమే ప్రారంభించిందన్నారు. బళ్లారి జిల్లాలో గోశాలను తెరవలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో గోవులపై హింసాకాండలు పెరిగిపోయాయన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర కంటే తక్కువ పరిమాణంలో కొనుగోలు చేయాలన్నారు. బళ్లారిలో ఎండు మిర్చి మార్కెట్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇన్‌ఛార్జిమంత్రి జమీర్ ఖాన్ నియోజకవర్గం మంత్రి తన పదవికి రాజీనామ చేయాలని సఫాయి కర్మచారి అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు హెచ్.హనుమంతప్ప డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గాడి శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను నవతరం కాపాడుకోవాలి

● రాష్ట్ర తెలుగు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర రావు



కర్ణాటక తెలుగు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బళ్లారి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను నవతరం మరిచిపోకుండా కాపాడుకోవాలని, ఆంగ్లమాధ్యం, ఇతర మాధ్యమాలు మోజులు పడి తల్లిలాంటి తెలుగు భాషను మరవరాదని ఇంటిలో పిల్లలకు కూడా పెద్దలు తెలుగు రాయడం, చదవడం నేర్పాలని కర్ణాటక తెలుగు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర రావు కోరారు. హొస్పేట్‌లోని టీబీడ్యాం వద్ద ఉండే కర్ణాటక తెలుగు సంఘం కార్యాలయంలో వీరు కర్ణాటక తెలుగు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. విదేశాల్లో ఉండే తెలుగు వాళ్లు కూడా అంతా ఏకమైతెలుగు భాషను కాపాడుకునుందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాగే ఇంతక ముందు మహారాష్ట్రలో జరిగిని రాష్ట్రేతర తెలుగు సమాఖ్యలో కూడా సుమారు 16 రాష్ట్రాలో ఉండే తెలుగు వారు సమావేశం అయ్యారని ప్రధానంగా మాతృభాష అయిన తెలుగును కాపాడుకునేందుకు ప్రతి ఒక్క తెలుగువారు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎన్ గోవిందప్ప, సెక్రెటరీ ఆర్ .ధర్మారావు, వైస్‌ప్రెసిడెంట్ రాధాకృష్ణ. ఎన్ వెంకటరమణ, జీఎన్ వెంకటేశ్వరావు, తిప్పేస్వామి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశులు పాల్గొన్నారు.

సభ్యత్వం ఉన్నవారినే అనుమతించాలి

● ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ డిమాండ్



విలేకరుల సమావేశంలో ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు

బళ్లారి సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా తాలూకా ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, స్టూడియో ఓనర్స్ అసోసియేషన్‌లో సంఘంలో సభ్యుడిగాఉండి ఐడీకార్డు ఉన్నవారిని మాత్రమే ఫోటోలు, వీడియోలు తీసేందుకు అనుమతించాలని సంఘం సభ్యులు కోరారు. సోమవారం నగరంలోని ముండ్లూరు రామప్ప హాల్లో జరిగిన బళ్లారి, తాలూకా సంఘాల సభ్యుల సమావేశంలో ఫోటోగ్రాఫర్ల సంఘం గౌరవాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో నకిలీ ఫొటోగ్రాఫర్ల బెడద ఎక్కువైందన్నారు. కొన్నికల్యాణ మండపం, సౌండ్ సిస్టమ్, మేనేజ్‌మెంట్ , హోటల్స్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ల వద్ద ఫొటోగ్రాఫర్లు ఉన్నారన్నారు. ఈసందర్భంగా సంఘం జిల్లాధ్యక్షుడు నాదగౌడ చంద్రమోహన్,బళ్లారి తాలూకా అధ్యక్షుడు బి.శ్రీధర్,సండూర్ తాలూకా అధ్యక్షుడు వినయ్‌కుమార్, కంప్లి తాలూకా అధ్యక్షుడు జగదీశ్, కురుగోడు తాలూకా అధ్యక్షుడు శ్రీధర్, సిరుగుప్ప తాలూకా అధ్యక్షుడు నాగరాజ, వీరేశ్, సంఘం సభ్యులు నాగల్లి వీరేశ్,రాఘవేంద్ర,రవీంద్రారెడ్డి, బుజ్జి, తాయన్న పాల్గొన్నారు.

దొరికిన పర్సు అప్పగింత

బళ్లారి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పర్సు పోగొట్టుకున్న ఓ బాధితుడికి తిరిగి అప్పగించడంపై పలువురు ప్రశంసిస్తున్నారు. నగరంలోని ఓ చానల్‌లో పని చేస్తున్న ఫొటో జర్నలిస్టు మురళీ కాంతారావ్ తన నిజాయతీని చాటుకున్నారు. మురళీ కాంతరావ్‌కు బళ్లారిలోని రాయల్ సర్కిల్ వద్ద ఉన్న ఆర్‌టీహెచ్ హోటల్ వారం రోజుల క్రితం ఓ పర్సు దొరికింది. అందులో ఓ డ్రైవింగ్ లైసెన్స్, కొంత నగదు ఉంది. డ్రైవింగ్ లైసెన్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా పర్సు పోగొట్టుకున్న బాధితుడు గొల్ల మహేష్, అనంతపురం అని గుర్తించారు. ఓ పత్రికా ప్రతినిధి హరిశంకర్ సాయంతో బాధితుడి అడ్రస్ కనుగొని అప్పగించారు. రూ. 7 వేల నగదు, లైసెన్సు ఉందని మరళికి కృతజ్ఞతలు తెలిపారు.



పర్సును అప్పగిస్తున్న మురళీకాంతరావు

వైభవంగా జియారత్ పల్లకి ఊరేగింపు

కంప్లి, జనవరి 13(ఆంధ్ర జ్యోతి): పట్టణంలో జోగి కాలువ వద్ద వుండే జడేసాబ్ ఖాద్రి 237వ ఉరుసు సందర్భంగా సోమ వారం ముస్లిం గురువులైన సయ్యద్ షా అబ్దుల్ హస్సేన్ ఖాద్రి ఉరఫ్ అజామ్ సాహెబ్ జియారత్ పల్లకి పట్టణంలో ఊరేగించారు. భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం గురువులు

హోసూరు జోన్

దళితులపై దాడులకు అడ్డుకట్ట పడాలి

● వళ్ళలార్ జయంతి పురస్కారాలలో గవర్నర్ రవి



గవర్నర్ ఆర్ఎన్ రవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వళ్ళలార్‌గా పేరొందిన జ్యోతి రామలింగస్వామి 202వ జయంతిని పురస్కరించుకుని వళ్ళలార్స్ వివేగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవ కారుణ్య సేవా పురస్కారాల ప్రదానం సోమవారం ఏర్పాటైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గవర్నర్ ఆర్ఎన్ రవికి జిల్లా యంత్రాంగం ఆత్మీయ స్వాగతం పలికింది. కృష్ణగిరి కలెక్టర్ సరయు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతించారు. తొలుత జాతీయగీతం ఆలపించిన తరువాత తమిళతాయ్ అనే గీతాన్ని పాడారు. అనంతరం పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ ఆరు దశాబ్దాలు గడిచినా దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం దక్కేందుకు రాజకీయ నాయకులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు స్వామిజీలు, ఎస్పీ తంగదురై పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయాలను సాధించాలి

బళ్లారి సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ప్రపంచానికి గర్వకారణమైన భారత పుత్రుడు, యువతకు స్ఫూర్తిదాయకమైన స్వామి వివేకానంద ఆశయాల సాధనకు పాటుపడాలని శ్రీమేథ పూర్వ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్ అన్నారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా నగరంలోని కోట ప్రదేశంలో శ్రీమేథ పూర్వ గ్రాడ్యుయేట్ కళాశాల హాల్లో సోమవారం నెహ్రూ యువజనోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పత్యేక అధ్యాపకులుగా విచ్చేసిన సరళాదేవి కళాశాల నాటక విభాగం అతిథి అధ్యాపకులు నేతి రఘురామ్ మాట్లాడుతూ వీరసన్యాసి, దార్శనికుడు,భారతదేశంలో భారతీయసంస్కృతిని విదేశాల్లో ప్రచారం చేసిన ఏకైక వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. ఈసందర్భంగా కళాశాల వై ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, ఇబ్రహీంపూర్ చిరు కలాబృందానికి చెందిన హలుగప్ప గాత్ర ప్రదర్శన నిర్వహించారు. అక్షయ కళా ట్రస్టు సుంకప్ప, నెహ్రూ యువకేంద్రం అంబరీష్ పాల్గొన్నారు.

డ్రగ్ కంట్రోల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

రాయచూరు జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆశాపూర్ రోడ్డులో ఉన్న డ్రగ్ కంట్రోల్ కార్యాలయంలో సోమవారం ఆకస్మికంగా అగ్ని ప్రమాదం సంభవించింది. కార్యాలయంలో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన స్థానికులు కార్యాలయం అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. కీలకమైన ఫైళ్లు కాలిపోయినట్లు అధికారులు తెలిపారు.

పాఠశాలలో ఘనంగా పొంగల్



పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హోసూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హోసూరు యూనియన్ దాసరపల్లి పాఠశాల ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సమానత్వ పొంగల్‌ను సోమవారం నిర్వహించారు. పాఠశాలకు వచ్చిన 650 మంది విద్యార్థులకు పొంగల్ పంపిణీ చేశారు. పాఠశాల నిర్వహణా కమిటీ చైర్‌పర్సన్ విజి ఆధ్వర్యంలో పొంగల్ వేడుకలు సాగాయి. ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల కమిటీ సభ్యులు జయలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

యోగీశ్వర ఆలయంలో విశేష పూజలు



అలంకరణలో యోగీశ్వర స్వామి

హోసూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బృందావన్ నగర్‌లోని యోగీశ్వర ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటలకు కలశపూజ, ఆరుద్ర నక్షత్ర విశేష అభిషేకం, మహామంగళారతి నిర్వహించారు. ధనుర్మాస పూజలు విశేషంగా సాగాయి. ప్రత్యేకంగా సిద్ధం చేసిన పొంగల్‌ను భక్తులకు పంపిణీ చేశారు.

డ్రైవర్లకు నేత్ర పరీక్షా శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హోసూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా రవాణా కార్యాలయం హోసూరుల్లో ప్రాంతీయ రవాణా శాఖ, మాగ్నమ్ అరిమా అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా ఆర్‌టీఓ ప్రభాకరన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన 200 మందికి పైగా డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ మణిమారన్, మేఘన అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మహేంద్రన్, కణ్ణన్, రవిశంకర్, గోవిందన్, వైద్యులు ఆరతి, బిందు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డ్రైవర్లకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

కిసాన్ మోర్చా పై నిర్లక్ష్యం వీడాలి

రాయచూరు జనవరి 12(ఆంధ్రజ్యోతి): వివిధ డిమాండ్ల సాధన కోసం రైతాంగం చేపట్టిన పోరాటం పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కర్ణాటక రైతు సంఘం, హసిరు సేనల గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటీల్ డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుడైన సంయుక్త కిసాన్ మోర్చా అగ్రనేత జగజీత్ సింగ్ చేపట్టిన అమరణ నిరాహార దీక్ష విరమణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.